క్లుప్తంగా

అర్హులంతా పింఛన్‌కు దరఖాస్తు చేసుకోవాలి

బంజారాహిల్స్: వెంకటేశ్వర కాలనీ డివిజన్‌లో కొత్తగా ఆసరా పింఛన్ మంజూరైన లబ్ధిదారులకు గుర్తింపు కార్డులను గురువారం కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి అందజేశారు. పింఛన్ లబ్ధిదారులకు ఈ డిజిటల్ కార్డులతో మెరుగైన సేవలు లభిస్తాయన్నారు. ప్రతి ఒక్కరికీ కార్డులు పంపిణీ చేస్తామన్నారు. అర్హులంతా ఆసరా పింఛన్ కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. స్పెషల్ ఆర్ఐ యాద య్య,వీఆర్ఓలు మురళి, మహేశ్, శేఖర్ పాల్గొన్నారు.

'కంటి వెలుగు'తో ఎంతో ప్రయోజనం

రహమత్‌నగర్: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన కంటి వెలుగు వైద్య శిబిరం వల్ల ఎంతో మంది కంటి రోగులకు ప్రయోజనం చేకూరుతోందని జీహెచ్ఎంసీ సర్కిల్–19 టౌన్ ప్లానింగ్ ఏసీపీ శ్రీనివాస్ అన్నారు. కార్మికనగర్ కమ్యూనిటీ హాల్లో ఏర్పాటు చేసిన కంటి వెలుగు వైద్య శిబిరాన్ని గురువారం ఆయన సందర్శించి కంటి పరీక్ష చేయించుకున్నారు. టౌన్ ప్లానింగ్ అధికారి శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు విజయ్‌కిరణ్, సన్మాన్, రఘు పాల్గొన్నారు.

ఆహారపు అలవాట్లతోనూ హార్ట్ ఎటాక్స్

శ్రీనగర్‌కాలనీ: ఆధునిక యుగంలో మారిన ఆహారపు అలవాట్లు, పద్ధతుల వల్ల యుక్తవయసు వారికి కూడా హార్ట్ ఎటాక్స్ వస్తున్నాయని, కావున అందరూ తరచూ వైద్య పరీక్షలు నిర్వహించుకోవాలని ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ నిషాంత్ సుంకరినేని అన్నారు. శ్రీనగర్‌కాలనీలోని నిఖిల్ హాస్పిటల్‌లో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, గుండెపోటుకు ఒబెసిటీ, బీపీ, డయాబెటీస్‌తో పాటు పలు అంశాలు కారణం కావచ్చన్నారు. ఈనెల 5 నుంచి 12వ తేదీ వరకూ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ తమ ఆసుపత్రిలో కార్డియాలజీకి సంబంధించిన ఈసీజీ, బీపీ, బ్లడ్ షుగర్, బీఎంఐ వంటి పరీక్షలు తమ ఆసుపత్రిలో ఉచితంగా నిర్వహిస్తామన్నారు. ప్రతి ఒక్కరూ వచ్చి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.

పరామర్శ

హిమాయత్‌నగర్: గత కొంతకాలంగా అనారోగ్యంతో చికిత్స పొందుతున్న కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు పృథ్వీరాజ్ త్వరగా కోలుకోవాలని నియోజకవర్గ కాంగ్రెస్ అధ్యక్షుడు రోహిణ్‌రెడ్డి కోరారు. బర్కత్‌పురాలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పృథ్వీరాజ్‌ను రోహిణ్‌రెడ్డి గురువారం పరామర్శించారు. ఆయన వెంట కాంగ్రెస్ గ్రేటర్ ప్రధాన కార్యదర్శి దిలీప్‌రాజ్ రెడ్డి ఉన్నారు.

'సంక్షేమం'లో దేశానికి కేసీఆర్ రోల్‌మోడల్: దానం

వెంకటేశ్వరకాలనీ: తెలంగాణలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను దేశంలోని పలు రాష్ట్రాలు అనుసరిస్తున్నాయని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. సంక్షేమ రారాజు కేసీఆర్ దేశానికే రోల్‌మోడల్‌గా నిలుస్తున్నారన్నారు. గురువారం ఆయన వెంకటేశ్వర కాలనీ డివిజన్ కార్పొరేటర్ మన్నె కవితారెడ్డితో కలిసి బంజారాహిల్స్‌లోని గౌరీశంకర్ కాలనీలో 35 మందికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. ఆయన స్వయంగా లబ్ధిదారుల ఇంటింటికీ వెళ్లి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా దానం ప్రతి ఒక్కరినీ పేరు పేరునా పలకరిస్తూ కేసీఆర్ సంక్షేమ పథకాలను, పార్టీ సిద్ధాంతాలను తెలియజేశారు. కార్యక్రమంలో బస్తీ అధ్యక్షుడు రమేష్ యాదవ్, డివిజన్ అధ్యక్షుడు రాములు చౌహాన్, వెంకటేష్, శేఖర్, శ్రీను, శౌరి రాజు, యువరాజు పాల్గొన్నారు.



కల్యాణలక్ష్మి చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే దానం నాగేందర్

ఎంపీటీసీల సమస్యలను పరిష్కరించండి



మంత్రి దయాకర్ రావుకు వినతి పత్రం అందజేస్తున్న కుమార్ గౌడ్

బంజారాహిల్స్: ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎంపీటీసీలకు ఇచ్చిన హామీ మేరకు మండల పరిషత్‌లకు రూ.1300 కోట్లు మంజూరు చేయాలని తెలంగాణ రాష్ట్ర ఎంపీటీసీ సంఘం అధ్యక్షుడు గడీల కుమార్ గౌడ్ డిమాండ్ చేశారు. గురువారం బంజారాహిల్స్‌లోని మంత్రుల నివాస సముదాయంలో పంచాయతీరాజ్ శాఖ మంత్రి యర్రబెల్లి దయాకర్‌రావును కలిసి ఈమేరకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కుమార్ గౌడ్ మాట్లాడుతూ, తమకు సరైన నిధులు, విధులు, అధికారాలు లేక అనేక అవమానాలకు గురవుతున్నామన్నారు. గ్రామాభివృద్ధి కోసం ప్రతి ఎంపీటీసీకి ఏడాదికి రూ. 20 లక్షల చొప్పున బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని కోరారు. ఎంపీటీసీల గౌరవ వేతనాన్ని రూ.15 వేలకు పెంచాలన్నారు. తమ సమస్యలను సీఎం వెంటనే పరిష్కరించాలని కోరారు. మంత్రిని కలిసిన వారిలో సంఘం ఉపాధ్యక్షుడు వెంకటేశం చారి, కోశాధికారి మన్నె రాజు, మాణిక్యరెడ్డి, సంగన్న గౌడ్, సత్యనారాయణ, యాదయ్య ఉన్నారు.

జీతాలు పెంచాలని నిరాహారదీక్ష

వెంగళరావునగర్: పెరిగిన ధరలకు అనుగుణంగా కార్మికుల జీతాలను పెంచాలని సీఐటీయూ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు జె.కుమారస్వామి డిమాండ్ చేశారు. వెంగళరావునగర్ డివిజన్ పరిధిలోని ఎర్రగడ్డ ప్రభుత్వ ఛాతీ ఆసుపత్రిలో గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో నిరాహార దీక్ష చేపట్టారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కుమారస్వామి మాట్లాడుతూ, జీఓ 60 ప్రకారం కార్మికులకు కనీస వేతనం రూ.15,600 అమలు చేయాలని కోరారు. కార్మికుల జీతాలను తక్షణమే పెంచకపోతే డీఎంఈ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. జీతాలు పెంచే వరకు ఈ దీక్ష కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నేతలు ఆర్.నాని, స్వామి, టి.సాయిశేషగిరిరావు, నాయకులు నర్సీన్, శ్రీనివాస్, మాధవి, చంద్రకళ, అనిత, సంధ్య, విఠల్, రాపర్తి అశోక్ తదితరులు ఉన్నారు.



నిరాహారదీక్ష చేస్తున్న సీఐటీయూ కార్మికులు

'హ్యాండ్లూమ్ ఇండియా' ప్రదర్శన ప్రారంభం

శ్రీనగర్‌కాలనీ: శ్రీనగర్‌కాలనీలోని సత్యసాయి నిగమాగమంలో గురువారం హ్యాండ్లూమ్ ఇండియా–2023 పేరిట ఏర్పాటు చేసిన వస్త్ర ప్రదర్శనను నటి, యూట్యూబర్ నాగ భార్గవి ప్రారంభించారు. ఈ ప్రదర్శనలోని చీరలు చాలా ఆకర్షణీయంగా ఉన్నాయని, నగర ఫ్యాషన్ ప్రియులను ఆకట్టుకుంటాయని అన్నారు. దేశంలోని ప్రముఖ నగరాలకు చెందిన చేనేత కళాకారులు వారి ఉత్పత్తులైన సిల్క్, కాటన్, డిజైనరీ ఆభరణాలు, పలు ఫ్యాన్సీ వస్తువులను సుమారు 70 స్టాళ్లలో అందుబాటులో ఉంచామని నిర్వాహకుడు జయేష్‌గుప్తా తెలిపారు. చేనేత కళాకారుల ఉత్పత్తులు నేరుగా వినియోగదారులకు చేరాలనే సదుద్దేశంతో ఈ వస్త్ర ప్రదర్శన ఏర్పాటు చేశామని, ఈనెల 7 వరకూ ఇది కొనసాగుతుందని చెప్పారు.



ప్రదర్శనలోని చీరను ప్రదర్శిస్తున్న నటి నాగభార్గవి

తాగునీటి సరఫరా వేళలు మార్చాలని వినతి

పంజగుట్ట: ప్రేమ్‌నగర్‌లో తాగునీరు సరఫరా చేసే వేళలు మార్చాలని కాలనీ వాసులు గురువారం వాటర్‌వర్క్స్ బంజారాహిల్స్ డివిజన్–6 మేనేజర్ శివకుమార్‌కు వినతిపత్రం ఇచ్చారు. కాలనీ వాసులు మాట్లాడుతూ... తెల్లవారు జామున 3 నుంచి 5 గంటల వరకు మంచినీరు వదలడం వల్ల కాలనీవాసులకు నిద్ర కరువు అవుతోందని, దీంతో వివిధ ఆరోగ్య సమస్యలు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రేమ్‌నగర్ పంచాయతీ కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దాసరి విశ్వనాథం, భగవాన్‌దాస్, మున్నా, మాజిద్ పాల్గొన్నారు.

విద్యుత్ ఉండని ప్రాంతాలు

వెంగళరావునగర్: కల్యాణ్‌నగర్ సబ్‌స్టేషన్ పరిధిలో జరుగుతున్న మరమ్మతుల కారణంగా ఎర్రగడ్డ ఆసుపత్రి, వికార్‌పురికాలనీ, ఏజీ కాలనీ ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామని బంజారాహిల్స్ సీబీడీ ఏడీఈ వేణు ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే, రవీంద్రసొసైటీ సబ్‌స్టేషన్ పరిధిలో డీ–మార్ట్, కావేరీహిల్స్, ఇమ్రాల్ గార్డెన్ ప్రాంతాల్లో ఉ. 10 నుంచి మ. 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

దేశ ఆర్థిక స్థిరత్వాన్ని సూచించేలా బడ్జెట్

- స్వదేశీ జాగరణ్ మంచ్

పంజగుట్ట: కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ భారతదేశ ఆర్థిక స్థిరత్వాన్ని, సమ్మిళిత అభివృద్ధిని సూచించేలా ఉందని స్వదేశీ జాగరణ్ మంచ్ నాయకులు అన్నారు. గురువారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో స్వదేశీ జాగరణ్ మంచ్ ప్రాంత ప్రచార ప్రముఖ్ కేషవ్ సోనీ, ఆంధ్రప్రదేశ్ సంపర్క్ ప్రముఖ్ అశోక్, ప్రాంత కోశాధికారి హన్మండ్లు విలేకరులతో మాట్లాడారు. కరోనా మహమ్మారి, రష్యా– ఉక్రెయిన్ యుద్ధం కారణంగా ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మందగమనంలో ఉన్నప్పటికీ భారత ఆర్థిక వ్యవస్థ 2023– 24 ఆర్థిక సంవత్సరంలో 6.8 ఆర్థిక అభివృద్ధి సాధిస్తుందని అంచనాలు వేయడం భారతదేశ ధృఢమైన ఆర్థిక నిర్మాణానికి చిహ్నమ న్నారు. సికింద్రాబాద్ విభాగ్ ప్రముఖ్ సీఏ ముఖేష్ పాల్గొన్నారు.

'ప్రజా సమస్యలపై ఉద్యమిస్తాం'

లిబర్టీ: అందరికీ విద్య, వైద్యం అందించాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందని ఇండియన్ ప్రజా కాంగ్రెస్ నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఉదయలక్ష్మి అన్నారు. గురువారం లిబర్టీ ప్లాజాలోని ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ కార్యాలయలో పార్టీ పంచసూత్రాల లోగోను పార్టీ జాతీయ అధ్యక్షుడు కేబీ శ్రీధర్‌తో కలిసి ఆవిష్కరించారు. పేద, మధ్య తరగతి వర్గాలకు కనీస వసతుల కల్పన, ప్రజా సమస్యల పరిష్కారం కోసం తమ పార్టీ తరఫున ప్రత్యేక పోరాట ఎజెండా రూపొందించి ఉద్యమిస్తామని ఉదయలక్ష్మి తెలిపారు.